క్లుప్తంగా

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందజేస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీలోని మూడు నిరుపేద కుటుంబాలకు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించింది. పెదమడక, కొండయ్యవలస, పినమడక ప్రాంతాల్లో నివాసముంటున్న వీరికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, గోధుమ నూక, పిండి, ఆయిల్, చింతపండు, పంచదార, ఇతర నిత్యావసర సరకులు అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు, సలహాదారు పట్టా రామ అప్పారావు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలకు దాతలు సహకారం ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, జామి గణేష్, పొన్నగంటి కొండలరావు, ఎస్.గోవిందరావు, లక్కరాజు రాము, పిళ్లా శ్రీనివాస్, బొండా ఈశ్వరరావు, పూడి నరేష్ పాల్గొన్నారు.

మింది యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా అనూష



డాక్టర్ అనూష

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ జి.అనూష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన మొదటి పోస్టింగ్ మింది యూపీహెచ్‌సీలోనే అని వెల్లడించారు. సిబ్బంది సహకారంతో యూపీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు నాణ్యమైన సేవలందించడానికి కృషి చేస్తానని తెలిపారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో పలు చోట్ల సీసీ రోడ్డు, మురుగు కాలువలు ధ్వంసం అయ్యాయని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి అన్నారు. ఈ మేరకు అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కాలువలు ధ్వంసం కావడంతో పందికొక్కులు, ఎలుకలు సంచరిస్తూ వ్యాధులకు కారణమవుతున్నాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి జాబిలీహిల్స్‌లోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రయుక్త రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆంజనేయులు స్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకం జరిపించి తర్వాత విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు పెదగంట్యాడలో రెవెన్యూ సదస్సు

పెదగంట్యాడ: మండలంలో మంగళవారం నుంచి ఈ నెల 31 వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు పెదగంట్యాడ తహసీల్దార్ పి. అమల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో, 26న అప్పికొండ గ్రామానికి సంబంధించి నమ్మిదొడ్డి సచివాలయం వద్ద, 28న పెదపాలెం సచివాలయం వద్ద, 31న నడుపూరు గ్రామానికి సంబంధించి కేఎస్ పాలెం సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సంబంధిత అన్ని అంశాలపై వినతులు స్వీకరిస్తామని తెలిపారు.

శత సంకల్పం



నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

టెన్త్ క్లాస్.. విద్యార్థి దశలో ఎంతో కీలకం. బంగారు భవిష్యత్తుకు పునాది. ఉన్నత శిఖరాల అధిరోహణకు తొలి మెట్టు. అలాంటి పదో తరగతి పరీక్షలు సమీపించడంతో అధికారులు శతశాతం ఫలితాల సాధనపై దృష్టిసారించారు. దీని కోసం 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. 'పది'ంతల శ్రద్ధతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

- పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- శతశాతం ఫలితాల సాధనకు 100 రోజుల ప్లానింగ్
- శని, ఆదివారాల్లోనూ బోధన

పెదగంట్యాడ: పదోతరగతి పరీక్షల షెడ్యూల్ ఖరారు కావడంతో ప్రత్యేక తరగతుల నిర్వహణపై దృష్టిసారించారు. మంచి మార్కులతో పాటు విద్యార్థులంతా ఉత్తీర్ణులయ్యేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రమీల, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాలతీల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఫోకస్ పెట్టారు. సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తించి ప్రత్యేకంగా బోధన సాగిస్తున్నారు.

జిల్లా కలెక్టర్ ఈ సారి నూరు శాతం ఫలితాలు రావాలని నిర్దేశించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులను పాఠశాలల పర్యవేక్షణకు నియమించారు. జిల్లా విద్యా శాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి, డైట్ ప్రిన్సిపల్ జట్టుగా ఏర్పడి వెబ్‌ఎక్స్‌ల ద్వారా అవగాహన కల్పిస్తూ ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ప్రతి శని, ఆదివారాలతో పాటు సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఏబీసీడీ గ్రేడులతో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు.



యారాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయురాలు



గంగవరం హైస్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు



నైట్ విజిట్‌లో ఇస్లాం పేట హైస్కూల్ హెచ్‌ఎం ప్రమీల, ఉపాధ్యాయుడు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా కలెక్టర్, జిల్లా విద్యా శాఖాధికారి ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. పదో తరగతికి పది సూత్రాలు అమలు చేస్తున్నారు. మండల విద్యా శాఖాధికారులు, ఉప విద్యా శాఖాధికారులు, ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో సూక్ష్మ ప్రణాళిక రూపొందించి శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు.

అవగాహన సదస్సులు

విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. అలాగే పరీక్ష విధానం, ప్రశ్న పత్రాలపై విద్యార్థులను సన్నద్ధం చేసేలా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరీక్షల హాజరయ్యే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

100 రోజుల ప్రణాళిక

డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ (డీసీఈబీ) ఆధ్వర్యంలో 100 రోజుల ప్రణాళికను తయారు చేశారు. ఏ రోజు ఏ సబ్జెక్ట్, ఏ చాప్టర్ చదవాలనే దానిపై ప్రణాళిక సిద్ధం చేశారు. దీనిని పాఠశాలలకు పంపించారు.

ప్రత్యేక శ్రద్ధతో బోధన



జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఆదేశానుసారం పదో తరగతి విద్యార్థుల కోసం ప్రణాళికలు సిద్ధం చేశాం. పరీక్షల సమయానికి ముందు నుంచి 100 రోజుల ప్రణాళికతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఈ ఏడాది శత శాతం ఉత్తీర్ణతతో పాటు జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించేలా విద్యార్థులను తయారు చేస్తున్నాం.

–రాచకొండ శ్రీనివాస్, హెచ్‌ఎం, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

నైట్ విజిట్స్

ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రమీల, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లను రాత్రి పూట విజిట్ చేస్తున్నారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు ఎలా చదువుతున్నారో ఆరా తీస్తున్నారు.

దత్తత విధానం

పాఠశాలలో పని చేసే ప్రతి ఉపాధ్యాయుడు చదువులో వెనుకబడిన, 500 మార్కులు దాటే విద్యార్థులను దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో పటిష్టమైన ప్రణాళికతో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నారు.

పాఠాలు బాగా చెబుతున్నారు



ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ పెట్టారు. ఏ విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో వారే గుర్తిస్తున్నారు. ఆ విద్యార్థుల్లో నేనూ ఉన్నాను. నాకు గణితం అంటే బెంగగా ఉండేది. ఇప్పుడు గణితం నాకు కొట్టిన పిండే.. నిద్రలో లేపి లెక్కలు అడిగినా ఇట్టే చెప్పేస్తాను. నాలో భయం పోగొట్టి, లెక్కలంటే ఇష్టం వచ్చేలా మా ఉపాధ్యాయులు తయారు చేశారు. లెక్కల్లో 100కి 100 సాధిస్తాను.

–వై. అనిత, 10 వ తరగతి, నడుపూరు ఉన్నత పాఠశాల

ఉక్కు కార్మికుల వేతనాల కోసం..

రేపు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

అగనంపూడి: విశాఖ ఉక్కు యాజమాన్యం మొండి వైఖరి విడనాడి కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలని, వేతన బకాయిలు వెంటనే జమ చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో సోమవారం చేపట్టిన 1404వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. కార్మికులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. ఉక్కు యాజమాన్యంలో నేడు జవాబుదారీతనం లేకుండా పోయిందని ఆరోపించారు. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఈనెల 18న ఉక్కు అడ్మిన్ భవనం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు డీసీహెచ్ వెంకటేశ్వరరావు, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సూరిబాబు, పాపారావు, ఎర్రయ్య, కె.అప్పారావు, ఎం.వి.రమణ, మధు, రాజేశ్వరరావు, సోమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ప్రసన్న వేంకటేశ్వరుడు

అక్కిరెడ్డిపాలెం: బిల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన ప్రసన్న వేంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలను సోమవారం వైభవంగా నిర్వహించారు. జనవరి 13వ తేదీ వరకూ ఈ పూజలను నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. 21న ప్రసన్న వేంకటేశ్వరునికి లక్ష తులసి పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఉత్సాహంగా 'భగత' ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ భగత ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భగత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉక్కునగరం నెహ్రూ పార్కులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ సీఐ దాలిబాబు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి. తాడన్న, స్టీల్‌ప్లాంట్ సీనియర్ మేనేజర్ బి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో భగతల పాత్ర వెలకట్టలేనిదన్నారు. భగతలు ఐక్యంగా ఉండి తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు, పిల్లలు ఆటపాటలతో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవి నాయుడు, బోడం రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్. లక్ష్మినాయుడు, ఎస్. వెంకటరాజు, వి.ఆర్.సి.బి. నాయుడు, అబ్బాయ్ రాజు, రాజేష్, వర్మ, జి.ఎస్. మూర్తి, నాయుడు, కల్యాణ్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అవశ్యం



ట్రీ గార్డు ఏర్పాటు చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

అగనంపూడి: ప్రతీ ఇళ్ల ముందు మొక్కలు నాటి సంరక్షించాలని.. అప్పుడే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. ఉమామహేశ్వరస్వామి ఆలయం ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఆలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. తాండవ లక్ష్మీ వాసు, గంతకోరు అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, గెద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



ఉక్కు వెంకన్న ఆలయంలో నగర సంకీర్తన

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి నిర్వాసితకాలనీ లక్ష్మీపురం కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. సోమవారంతో మొదలైన పూజలు వచ్చే ఏడాది జనవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం నాలుగు గంటల నుంచి నగర సంకీర్తన, సాయంత్రం 6 గంటల నుంచి విష్ణు సహస్ర పారాయణ పఠించనున్నట్టు చెప్పారు. 20న సామూహిక కుంకుమార్చన, 26న రథయాత్ర, 27న తులసీ దళపూజ, 4న వేంకటేశ్వరస్వామి వ్రతాలు, 8న దీపాలంకరణ, 10న వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి), అదేరోజు ఉత్తర ద్వార దర్శనం, 11న కూడారై ఉత్సవాలు, 13న గోదారంగనాథుల కల్యాణం, 14న కల్యాణ వేంకటేశ్వరస్వామి పరస మహోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు.

ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 6.38 నిమిషాలకు నెలగంట కొట్టారు. ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, ఉదయ కృష్ణమాచార్యులు, హరినారాయణ స్వామి నేతృత్వంలో వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి సుప్రభాత సేవ, తిరుప్పావై చేశారు. అనంతరం నిర్వహించిన సేవాకాలం, నగర సంకీర్తనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గోదాదేవికి అర్చన, పాశుర విన్నపం చేశారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సిల్వర్ కాయిన్ల పంపిణీ



సిల్వర్ కాయిన్ అందజేస్తున్న ఉక్కు డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన ఓబీసీ ఉద్యోగులకు సోమవారం సిల్వర్ కాయిన్లు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో ఆగస్టులో జరిగిన సాధారణ సమావేశంలో రిటైర్డ్ ఓబీసీ ఉద్యోగులకు సిల్వర్ కాయిన్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో సోమవారం 42 మంది రిటైర్డ్ ఉద్యోగులకు 75 గ్రాముల చొప్పున సిల్వర్ కాయిన్లు పంపిణీ చేశారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ, సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి అసోసియేషన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల నాగరాజును సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ డీజీఎం సెహగల్, లైజన్ ఆఫీసర్ ఉమామహేశ్వరావు, అసోసియషన్ అధ్యక్షుడు బి. అప్పారావు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, ఉప ప్రధానకార్యదర్శి కొయిలాడ శ్రీనివాసరావు, వై.ఎల్. నాయుడు, ఉండవల్లి శ్రీనివాసరావు, ఉదయ కుమారి, ప్రవీణ, దొడ్డి సన్నిబాబు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా ఏలేరు కాలువ



వ్యర్థాల కుప్పలతో ఏలేరు కాలువ



దుమ్ము, ధూళి పడడంతో ఇలా...

అగనంపూడి: కూర్మన్నపాలెం, ఫకీర్‌తక్యా మధ్యలో ఏలేరు కాలువ తవ్వి వదిలేసిన ప్రాంతం డంపింగ్ యార్డును తలపిస్తోంది. చెత్తాచెదారం, భవన నిర్మాణ , ఆస్పత్రి వ్యర్థాలు, చికెన్ దుకాణ వ్యర్థాలు డంపింగ్ చేస్తుండడంతో ఆ ప్రాంతం అధ్వానంగా మారింది. మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఏవీ అండ్ ఎంకే గేటెడ్ కమ్యూనిటీ నుంచి సైమన్ నగర్, ఫకీర్‌తక్యా రహదారి వరకు సుమారు అర కిలోమీటరు దూరం వరకు ఏలేరు కాలువ తవ్వి మధ్యలో వదిలేశారు. దీంతో చెత్తా చెదారం, చికెన్ దుకాణాల వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌కు స్థావరంలా మార్చేశారు. దీంతో కుక్కలు, పందులు, దోమలు, పాములు, క్రిమికీటకాలకు ఆవాసంగా మారిపోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే. ఈ సమస్యపై జీవీఎంసీకి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. కాలువ నిర్మాణం పూర్తి చేసి ప్రధాన డ్రైనేజీగా మార్పు చేసి బహుళ అంతస్తుల ఔట్‌లెట్‌లను అనుసంధానం చేస్తే ఇబ్బందులు తప్పుతాయని స్థానికులు చెబుతున్నారు.



ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు

ఇంధన పొదుపుతో భవితకు మేలు



విద్యుత్ పొదుపు చర్యలపై రూపొందించిన బ్రోచర్ అందజేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను సోమవారం శ్రీనగర్‌లోని డీమార్ట్‌లో ఘనంగా నిర్వహించారు. కస్టమర్లకు జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు, డీఈ కె.రామకృష్ణ, ఆటోనగర్ ఏఈ చంద్రశేఖర్ విద్యుత్ పొదుపు చేయడానికి పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. విద్యుత్ ఆదా చేయడానికి అనుసరించాల్సిన విధానాలను తెలుపుతూ ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్మస్ సందడి



కళకళలాడుతున్న దుకాణం

పెదగంట్యాడ: మండలంలో క్రిస్మస్ సందడి మొదలైంది. క్రైస్తవ మందిరాలు, గృహాలు, నూతనత్వాన్ని సంతరించుకున్నాయి. సత్యం, శాంతి, కరుణ, త్యాగం, దయ, ప్రేమ అనే సందేశాలతో ఏసుక్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. త్యాగానికి ప్రతీక అయిన క్రిస్మస్ పండగను ఈ నెల 25న జరుపుకునేందుకు క్రైస్తవులు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో మార్కెట్లో స్టాల్స్, క్రైస్తవుల ఇళ్లు, ప్రార్థనా మందిరాలు విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి.



విద్యుత్ కాంతులతో వుడా కాలనీ లివింగ్ క్రైస్ట్ చర్చి